

అవగాహన కల్పిస్తున్న న్యాయసేవాధికార సంస్థ సభ్యులు

## 8న జాతీయ లోక్ అదాలత్

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 27: రాజీ మార్గమే రాజామార్గం అనే నినాదాన్ని ప్రజల్లో నింపాలనే ఉద్దేశంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లాలో విరివిగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ మున్సిపాలిటీ మైదానంలో గురువారం జరిగిన సంత వద్ద న్యాయసేవాధికార సంస్థ బృందం సభ్యులు మొబైల్ వ్యాన్‌తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్షణికావేశాలకు పోయి పగలు, పంతాలు పెంచుకొని కేసుల్లో ఇరికితే, పోలీస్‌స్టేషన్లు కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని, విలువైన సమయం, మనశ్శాంతి, డబ్బు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. పేదరికరంతో ఉన్నవారు, న్యాయ సహాయం కావాల్సిన వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థను నేరుగా సంప్రదించాలని వారు తెలిపారు.

## నేడు డయల్ యువర్ డీఎం

ములుగురూరల్, ఫిబ్రవరి 27 : ములుగు జిల్లా పరిధిలో నేడు జరిగే డయల్ యువర్ డీఎంను ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ వరంగల్-2 డిపో మేనేజర్ వీ జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12గంటల నుంచి ఒంటి గంట వరకు 99592 26048 గల నంబర్‌ను సంప్రదించి ఆర్టీసీ సమస్యలను, సలహాలను అందించాలని కోరారు.

## బావిలో పడి వృద్ధుడు మృతి

రేగొండ, ఫిబ్రవరి 27 : మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన సుంకరి రవి (59) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలు.. బాగిర్థిపేటకు చెందిన సుంకరి రవి ఈ నెల 26న ఇంటి వద్ద కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినాఆచూకీ లభించలేదు. అప్పడప్పుడు ఇంటి పక్కన ఉన్న బావిలో మంచినీళ్లు తీసుకవచ్చేవాడని, బావి వద్దకు వెళ్లి ఉంటాడనే అనుమానంతో గురువారం ఉదయం ఇంటి పక్కన ఉన్న బావిలో చూడగా రవి మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించంగా మృతదేహాన్ని గురువారం బయటికి తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

## ఉరేసుకొని ఆత్మహత్య

చిట్యాల, ఫిబ్రవరి 27 : మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కాల్వపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథరం ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్ది సతీశ్(32) కొంతకాలంగా కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సతీశ్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపెట్టుకునేవాడు. దీంతో సతీశ్ భార్య లక్ష్మి నెలరోజుల క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లి తిరిగి రావడం లేదు. దీంతో మనస్తాపం చెందిన సతీశ్ గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు కిందకు దించి ఊర్లోని ఆర్ఎంపీని పిలిచి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి తల్లి కిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

చిట్యాల, ఫిబ్రవరి 27 : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని చల్లగరిగ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఇంచర్ల లక్ష్మి పాడి గేదె మేత కోసం గురువారం ఉదయం గ్రామ శివారులోని సామల శ్రీహరి చేను వైపు వెళ్లింది. అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు గల ఎర్త్ వైరుకు తాకింది. ఎర్త్‌వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. అధికారులు స్పందించి గేదెకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

## అడవుల్లో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 27: వేసవిలో అడవిల్లో జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అటవీ సంరక్షణ అధికారి ప్రభాకర్ ఆదేశించారు. కాళేశ్వరం అటవీశాఖ డివిజన్ పరిధిలోని వెంకటాపురం, తాడ్వాయి, ఏటూరునాగారం అభయారణ్యం పరిధిలోని అటవీశాఖ అధికారులతో గురువారం ఆయన స్థానిక అటవీశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అటవీ సంరక్షణలో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినట్లు సమాచారం రాగానే వెంటనే స్పందించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వన్య ప్రాణులు దాహం తీర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అడవిలో ఏర్పాటు చేసిన సోలార్ పంప్ సెట్ల పనితీరు, కుంటలు, వాగులు, నీటి చెలిమలపై చర్చించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్‌కిషన్, డివిజన్ అధికారి రమేశ్, ఏటూరునాగారం, తాడ్వాయి, వెంకటాపురం డివిజన్ల పరిధిలోని రేంజ్ ఆఫీసర్లు, డిప్యూటీ రేంజర్లు, సెక్షన్, బీటు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## జనార్దన్‌రావు వర్ధంతి

ములుగురూరల్, ఫిబ్రవరి 27: ములుగు జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు వర్ధంతి వేడుకలను ఆదివాసీ ఉద్యోగులు, తుడుందెబ్బ, పెసా కమిటీ, ఆదివాసీ యువత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. నాడు కేయూ ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే ఆదివాసీ గిరిజన భూముల పరాయీకరణ అనే అంశంపై 1995లో డాక్టరేట్ అందుకున్నారని, 1/70 చట్టాన్ని అమలు చేయాలని పోరాడారని, తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలు, వనరులపై ప్రశ్నించారని తెలిపారు. జయశంకర్ సారుతో కలిసి తెలంగాణ ఉద్యమంలో సైతం పాల్గొన్నట్లు వివరించారు. ఎం రవి, వీ రాజు, ఈ కుమార్, లక్కీ, అన్నవరం రవి కాంత్, పీ శ్రీధర్, ఎం పూర్ణ, రమీజ్, శ్రీను పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

PASSPORT MISSING

★ I, Mohammed Anwer S/o Late Yakub Ali, R/o H.No. 2-9-1232, Waddepally, Hanumakonda Dist. I lost my Passport. Passport No. H0389081 While Travelling by Bike from Waddepally to Subedari. So if found Please let me know Contact Cell: 7330516331.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- మధ్యాహ్నం తరువాత పుంజుకున్న పోలింగ్
- పర్యవేక్షించిన కలెక్టర్లు

జయశంకర్ భూపాలపల్లి/ములుగు, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గురువారం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కలెక్టర్లు రాహుల్‌శర్మ, టీఎస్ దివాకర, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్‌లు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా చూశారు. మధ్యాహ్నం నుంచే పోలింగ్ శాతం పెరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానానికి 93శాతం ఓటింగ్ జరిగింది. అలాగే మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానానికి (కాటారం డివిజన్‌లో) 92శాతం ఓటింగ్ జరుగగా మెదక్, నిజామాబాద్,కరీంనగర్,ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ స్థానానికి (కాటారం డివిజన్‌లో)76 శాతం ఓటింగ్ జరిగింది.

**పోలింగ్ సరళి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ ప్రారంభంలో మందకొడిగా జరిగినా మధ్యాహ్నం తరువాత ఊపందుకుంది. జిల్లాలో వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానానికి 329 మంది (215 పురుషులు, 114 మహిళలు) అలాగే మెదక్, నిజామాబాద్,కరీంనగర్,ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానానికి (కాటారం డివిజన్‌లో) 83 మంది (64 పురుషులు, 19 మహిళలు) ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. కాగా భూపాలపల్లి డివిజన్‌లో ఉదయం 10 గంటల వరకు 41మంది (12శాతం), 12 గంటల వరకు 154 మంది (46 శాతం), 2గంటల వరకు 259 మంది (78 శాతం), 4 గంటల వరకు 308 మంది (93 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే కాటారం డివిజన్‌లో 10 గంటల వరకు 16 మంది (19 శాతం), 12గంటల వరకు 41 మంది (49 శాతం), 2 గంటల వరకు 62 మంది (74 శాతం), 4గంటల వరకు 77మంది (92 శాతం) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం మీద జిల్లాలో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు 412 ఓట్లకు గాను 385 ఓట్లు పోలయ్యాయి.


భూపాలపల్లిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌శర్మ

### పట్టభద్రుల స్థానానికి..

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల స్థానానికిగాను జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం డివిజన్‌లోగల ఐదు మండలాల్లో ఎన్నికలు జరిగాయి. 76శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2483 ఓట్లకు (1734 పురుషులు, 749 మహిళలు)గాను 1903 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 10గంటల వరకు 213మంది(8 శాతం), 12 గంటల వరకు 705 మంది(28 శాతం), 2 గంటల వరకు 1261 మంది(50 శాతం), 4 గంటల వరకు 1903మంది(76 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, మహదేవపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బస్టాండ్ సమీపంలో టెంట్ వేయడంపై పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీంతో బీజేపీ నాయకులకు పోలీసులకు బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

## ములుగు జిల్లాలో 92.83శాతం పోలింగ్ నమోదు


ములుగులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగు జిల్లాలోని 9పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 628మంది ఓటర్లు ఉండగా 583 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 45మంది హాజరు కాలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా 92.83పోలింగ్ శాతం నమోదైంది. కాగా, ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పోలింగ్ విధానాన్ని కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్ పరిశీలించారు. వెంకటాపురం(నూగూరు)లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఎస్పీ, ఓఎస్డీ, ఏఎస్పీల పర్యవేక్షణలో మావోయిస్టుల కదలికలపై డ్రోన్ కెమెరాలను ఏర్పా టు చేసి పోలింగ్‌లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. ములుగులో 93.26శాతం, వెంకటాపూర్‌లో 87.50శాతం, గోవిందరావుపేటలో 94.44 శాతం, తాడ్వాయిలో 89.23శాతం, ఏటూరునాగారంలో 95.65, కన్నాయిగూడెం 94.74శాతం, మంగపేటలో 92.63, వాజేడులో 93.94, వెంకటాపురం(నూగూరు)లో 93.10శాతం పోలింగ్ జరుగగా జిల్లా వ్యాప్తంగా 92.83శాతంగా మొత్తం పోలింగ్ నమోదైంది. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగిన పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను నల్గొండకు ప్రత్యేక బందోబస్తు నడుమ తరలించారు. ములుగు జిల్లా కేంద్రంలో పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బ్యాక్స్‌లను సీజ్ చేసిన విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు.

## మావోయిస్టు కదలికలపై డ్రోన్ కెమెరాలతో నిఘా

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 27 : టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టు కదలికలపై ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్, ఓఎస్డీ గీతే మహేశ్‌బాబా సాహెబ్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయల పర్యవేక్షణలో డ్రోన్ కెమెరాలతో గురువారం ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలనే ఉద్దేశంతో వెంకటాపురం, వాజేడు, పేరూరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని పలు ఏజెన్సీ గ్రామాలపై, అటవీ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు, భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే డ్రోన్ కెమెరాలతో మావోయిస్టు కదలికలపై నిఘాను పెట్టామని, డ్రోన్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.


డ్రోన్ కెమెరా దృశ్యం

## ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన పీవో

ములుగురూరల్, ఫిబ్రవరి 27 : మండలంలోని జగ్గన్నపేట గ్రామంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా గురువారం తనిఖీ చేశారు. కిచెన్, డైనింగ హాల్, తరగతి గదులను సందర్శించి ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆవరణను శుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు వేడి ఆహారాన్ని అందించాలని అన్నారు. టాయిలెట్ బ్లాకులను పరిశీలించారు. అనంతరం జీసీసీ ఆహార పదార్థాల సరఫరా, నిల్వల రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీర్ బీ వీరభద్రం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రశాంత్, ఏఈ లక్ష్మణ్, టీఏ సురేశ్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా

## నష్టపరిహారం అందించాలి : బీఎస్పీ

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 27 : మక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గణేశ్‌చారి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ రైతులకు జరిగిన అన్యాయంపై అధికార పార్టీ, ప్రతిపక్షాలు స్పందించకపోవడం సరికాదని అన్నారు. రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆయన కోరారు.

## రామప్ప టెంపుల్ అద్భుతం

**అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్**

వెంకటాపూర్/తాడ్వాయి, ఫిబ్రవరి 27 : రామప్ప టెంపుల్ అద్భుతమని అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ కొనియాడారు. గురువారం ఆమె రామప్పను సందర్శించగా ఆర్డీవో వెంకటేశ్, ఉమ్మడి జిల్లా టూరిజం అధికారి శివాజీ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సన్నాయి మేళాలతో ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో పట్టువస్త్రాలు, శాలువాలతో సత్కరించారు. ఆలయ విశిష్టతను టూరిజం గైడ్ ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామప్ప శిల్పకళ అద్భుతమని కితాబిచ్చారు. శతాబ్దాల క్రితమే ఇంత గొప్ప శిల్పకళతో ఆలయాన్ని నిర్మించడం గొప్ప విషయమన్నారు. రామప్ప కట్టడానికి పట్టిన సమయం, వాడిన మెటీరియల్, ఎంత మంది పనిచేశారు, ఇటుకలను ఏ మెటీరియల్‌తో తయారు చేశారు వంటి వివరాలను గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. నీటిలో తేలే ఇటుకను స్వయంగా పరీక్షించి అబ్బురపడ్డారు. అనంతరం రామప్ప దేవాలయానికి సందర్శనకు వచ్చిన తాడ్వాయి మండలంలోని కాటాపురం గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ గురువుల చేతిలోనే ఉంటుందని, ఆనందంగా చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులకు ఎలాంటి సహాయసహకారాలు కావాలన్నా అందిస్తానని అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న హెచ్ఎం సుధాకర్‌ను ఆమె అభినందించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించారు. వారి వెంట ఎస్సై సతీశ్, ఆర్ఐ విజేందర్ టూరిజం సిబ్బంది లోకేశ్, శరత్, చిరంజీవి, శ్రావన్, ఎన్ఆర్ఐ పులి రవి, కేంద్ర పురావస్తు, దేవాదాయ, పోలీస్, రెవెన్యూ, టూరిజం శాఖల అధికారులు ఉన్నారు.


రామప్పలో పూజలు చేస్తున్న అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- మల్లంపల్లి క్రాస్ వద్ద లారీ ఢీకొని ఇద్దరు..
- తాడ్వాయి మండలం మొండ్యాలతోగు వద్ద కారు అదుపు తప్పి మరొకరు మృత్యువాత
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు


తాడ్వాయి : ప్రసాద్ (ఫైల్)

ములుగురూరల్/తాడ్వాయి, ఫిబ్రవరి 27 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం బుధారావుపేటకు చెందిన భార్యాభర్తలు ఎండీ మహమ్మూద్(52), షహీన(45)లు పొట్టకూటి కోసం ఆదిలాబాద్ జిల్లా ఆసీఫాబాద్‌లో పని నిమిత్తం వెళ్లారు. గురువారం స్వగ్రామమైన బుధారావుపేటకు వచ్చేందుకు మహమ్మూద్ తన ఎక్సెల్ బండిపై భార్య షహీనను తీసుకొని వస్తున్నాడు. మల్లంపల్లి క్రాస్ అయ్యి నర్సంపేట వైపుగా వెళ్తున్న క్రమంలో ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ములుగు ఎస్సై వెంకటేశ్వరరావు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే, మంగపేట మండలకేంద్రానికి చెందిన వ్యాపారి బొల్లా ప్రసాద్(45) తన స్నేహితులు రామసుబ్బశర్మ, శ్రీనివాస్, వెంకటేశ్‌లతో కలిసి వెంకటాపూర్ మండలంలోని రామప్పలో జరిగిన శివరాత్రి ఉత్సవాలకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున తిరిగి మంగపేటకు వస్తున్న క్రమంలో తాడ్వాయి మండల కేంద్రానికి సమీపంలోని మొండ్యాలతోగు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఇసుక లారీని తప్పించబోయి కారు అదుపుతప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవింగ్ చేస్తున్న బొల్లా ప్రసాద్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108వాహనం ద్వారా ఆస్పత్రికి తరలించారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.


ఎక్సెల్ బండిని ఢీకొట్టిన లారీ

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తాడ్వాయి: మండలకేంద్రంలో బుధవారం రాత్రి రోడ్డు దాటుతున్న క్రమంలో మండలంలోని చందా క్రిష్ణారావు అనే వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. మండలంలోని బయ్యక్కపేటకు చెందిన క్రిష్ణారావు బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా ఏటూరునాగారం నుంచి హనుమకొండకు వెళ్తున్న ప్రైవేట్ మినీ అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు గాయాలు కాగా స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అలాగే మేడారం సమీపంలో తాడ్వాయి వైపునకు వస్తున్న ఇసుక లారీ మూలమలుపు వద్ద అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తికి గాయాలపాలయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.


మల్లన్నకు మొక్కులు చెల్లించుకుంటున్న పుట్ట మధు

## భక్తి మార్గంతోనే ప్రశాంతత

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

మల్హార్, ఫిబ్రవరి 27 : భక్తి మార్గంతోనే మంచి పద్ధతి, ప్రశాంతత సాధ్యమవుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మల్హార్ మండలంలోని నాచారం మల్లయ్యపల్లిలోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయాన్ని మహాశివరాత్రి సందర్భంగా ఆయన గురువారం సందర్శించి స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లయ్యపల్లికి చెందిన కీ.శే. మల్లయ్య ఇక్కడ దేవుడు ఉన్నాడని గ్రహించి సమాజానికి చూపించారని, ఆనాటి నుంచి ఈనాటి వరకు మల్లికార్జునస్వామిని ఆరాధిస్తున్నామని తెలిపారు. గతంలో అనేక మంది దాతల సహకారంతోపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. ఇంకా ఆలయ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలన్నారు. భక్తులకు సేద తీరేలా షెడ్ల నిర్మాణంతోపాటు ఆహ్లాదకరమైన మంచి వాతావరణం కల్పించాలన్నారు. అయితే భక్తులకు సౌకర్యం కల్పించే అవకాశం తనకు వస్తే తప్పకుండా చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

మల్హార్: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. మండలంలోని నాచారంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిదురాల పురుషోత్తంను గురువారం పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన వేముల సంతోష్, ఉప్పుల రాజు, శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయా కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, మంథని మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ పుట్టపాక శ్రీనివాస్, మండల నాయకులు యాదగిరిరావు, మాజీ సర్పంచ్ రామయ్య, శ్రీశైలం, అన్‌సాన్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు కుమ్మరి సది, ముత్యాల రాజేందర్, నాయకులు గాదె భాస్కర్, సమ్మయ్య, సుధాకర్, కాశవేని వెంకయ్య, రైతు నాయకులు పాల్గొన్నారు.

## క్షతగాత్రుడికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి పరామర్శ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 27: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పండుగ సునీల్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ ధరించి జాగ్రత్తలు పాటించాలని లక్ష్మీనర్సింహారావు సూచించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు ప్రదీప్‌రావు ఉన్నారు.


సునీల్‌ను పరామర్శిస్తున్న లక్ష్మీనర్సింహారావు

## గతం కంటే పెరిగిన ఆలయ ఆదాయం

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 27 : శ్రీకాళేశ్వరముక్తీశ్వర క్షేత్రంలో నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాలకు గతం కంటే ఈ యేడాది ఆదాయం పెరిగిందని ఆలయ ఈవో మహేశ్ తెలిపారు. గురువారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఉత్సవాల ప్రసాదాల విక్రయం, అభిషేకం, ప్రత్యేక దర్శనం, తైబజార్ ద్వారా రూ.20,44,250 ఆదాయం వచ్చిందని, గత సంవత్సరం శివరాత్రి వేడులకు రూ.13,97,565 మాత్రమే ఆదాయం వచ్చిందన్నారు. ఈ యేడాది ఆలయానికి రూ.6,46,685 ఆదాయం పెరిందని ఆయన తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలు మూడు రోజుల విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఆయా శాఖల అధికారులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## బాలుడిని అప్పగించిన పోలీసులు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 27 : మండలంలోని పస్రా గ్రామంలో ఓ బాలుడు తప్పిపోగా సమాచారం సేకరించిన పస్రా పోలీసులు బాలుడి తల్లిదండ్రులకు గురువారం సాయంత్రం అప్పగించారు. ఎస్సై అచ్చ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం గ్రామానికి చెందిన గంటమూరి సుమన్ తన కుమారుడితో కలిసి మంథిని ఆర్టీసీ బస్సులో వెళ్తున్నాడు. సుమన్ మద్యం మత్తులో ఉండి నిద్రపోగా పస్రాలో పలువురు ప్రయాణికులు బస్సు దిగుతుండగా వారితోపాటు ఆ బాలుడు కూడా బస్సు దిగాడు. దీంతో పలువురు బాలుడిని పలు ప్రశ్నలు అడుగా సమాధానం చెప్పలేదు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై బాలుడి వద్దకు చేరుకొని పూర్తి వివరాలు తెలుసుకుని పేరు గాంధీకుమార్‌గా గుర్తించారు. తండ్రి సుమన్, తాత సారయ్యలకు పిలిపించి వారికి అప్పగించారు. బాలుడిని అప్పగించడంపై స్థానికులు ఎస్సైని ప్రశంసించారు.

## శతాధిక వృద్ధురాలు మృతి


రాజమ్మ(ఫైల్)

వెంకటాపూర్, ఫిబ్రవరి 27 : మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు అబ్బ గోపాల్‌రెడ్డి తల్లి అబ్బ రాజమ్మ(106) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పరామర్శించారు. రాజమ్మ మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, మాజీ జడ్పీటీసీ గై రుద్రమదేవీఅశోక్, మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పోశాల వీరమల్లు, చంటి భద్రయ్య, ప్రభాకర్‌రావు ఉన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన ఏడీఏ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఏడీఏ అవినాష్ గురువారం పలు షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల స్టాకు వివరాలను సేకరించారు. రైతులు ఇబ్బంది పడకుండా ఎరువులు సరఫరా చేస్తున్నామని, కొరత స్థానికంగా లేదన్నారు. ఎరువులు, పురుగుమందులు కొనే వారు తప్పకుండా రశీదు తీసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులను ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా సరఫరా చేస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. రికార్డులను పరిశీలించి నిల్వ వివరాలు, ధరలను పరిశీలించి స్టాకు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

## మృతుడి కుటుంబానికి సీపీఎం చేయూత

గోవిందరావుపేట, ఫిబ్రవరి 27 : మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన జగ్గారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా గురువారం సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి భీరెడ్డి సాంబశివ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు 50కేజీల బియ్యాన్ని అందజేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు రాజేశ్, మురళీ, బ్రహ్మాచారి ఉన్నారు.

## చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి

తాడ్వాయి, ఫిబ్రవరి 27 : చేపలవేటకు వెళ్లి ఈక క్రిష్ణమూర్తి అనే వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంగ్లాపురం గ్రామానికి చెందిన క్రిష్ణమూర్తి గ్రామానికి చెందిన మరికొందరితో గురువారం సాయంత్రం చేపలవేటకు సమీపంలోని వాగులోకి వెళ్లాడు. చేపలు పట్టే సమయంలో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు తెలిసింది. మృతికి గల కారణాలు తెలియలేదు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.